TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com

ADAAB CYBERABAD

| ఎడిటర్: బిల్లాలుపూర్‌సారా శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 05 | ఆదివారం , జూలై 19, 2026 | పేజీలు - 4 | వెల: 5/- |
|---|---|---|---|---|---|
| EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 05 | 19-07-2026 (SUNDAY) | PAGES: 4 | RS : 5/- |

## పెద్ద కలలు కనండి..కష్టపడి చదవండి

### విలువలను కాపాడుకోండి: మంత్రి మహమ్మద్ అజారుద్దీన్



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : విద్యార్థులు పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని కష్టపడి చదవాలని, జీవితంలో క్రమశిక్షణ, నిజాయితీ, విలువలను పాటిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర మైనారిటీల సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్), అరుట్లను సందర్శించిన మంత్రి మూడు గంటలకు పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యంతో మమేకమయ్యారు. భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అయిన అజారుద్దీన్ విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి, ఆటోగ్రాఫ్‌లు ఇస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, అదనపు జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. పాఠశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, హాస్టళ్లు, భోజనశాలలు, క్రీడా మైదానాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, తాగునీటి వసతులు, క్రికెట్ ప్రాక్టీస్ నెట్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులను మంత్రి పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచ స్థాయి విద్యా, క్రీడా మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని సూచించారు. తన చిన్ననాటి అనుభవాలను గుర్తు చేసుకున్న అజారుద్దీన్, తాను చదివిన పాఠశాలలో పరిమిత సదుపాయాలే ఉన్నప్పటికీ క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావంతోనే అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదిగానని చెప్పారు. విజయానికి సౌకర్యాల కంటే సంకల్పం, కృషి ముఖ్యమని పేర్కొన్నారు.

మిగితా 4 లో

## 850 కిలోల కల్తీ నెయ్యి సీజ్ !

### ఫుడ్ సేఫ్టీ శాఖ ఉక్కుపాదం..



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : రాష్ట్రంలో కల్తీ నెయ్యి తయారీ, విక్రయాలపై ఫుడ్ సేఫ్టీ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి ఇతర కొవ్వులు కలుపుతున్నారన్న సమాచారంతో జూలై 14, 15 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఫుడ్ సేఫ్టీ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తెలిపారు.

4

## కొలువుల కుంభమేళా కాదు..

# 'కుంభకోణాల కుంభమేళా'



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :

- కాంగ్రెస్ హామీలపై కేటీఆర్ విమర్శలు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించిన కేటీఆర్, అశోక్‌నగర్‌లో నిర్వహించిన 'చాయ్ పే చర్చా'లో చేసిన వాగ్దానాలను గుర్తు చేశారు. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు, డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు, విద్యా భరోసా వంటి హామీలు అమలు కాలేదని అన్నారు. తెలంగాణలో 'కొలువుల కుంభమేళా' పేరుతో 'కుంభకోణాల కుంభమేళా' జరుగుతోందని ఆరోపించిన ఆయన, ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తున్న నిరుద్యోగులపై ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందని విమర్శించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఢిల్లీలో రాజ్యాంగం గురించి మాట్లాడుతున్న రాహుల్ గాంధీ, తెలంగాణలో ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలు కాకుండా కాగితాలకే పరిమితమైందని ఆరోపించారు. రైతులు, యువత, మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరలేదని పేర్కొన్న కేటీఆర్, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విక్రమ్-1 విజయవంతం

### స్కైరూట్ బృందానికి ప్రధాని మోదీ అభినందనలు



ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ: భారత అంతరిక్ష రంగంలో మరో చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా ప్రయోగం కావడంతో ప్రధాని నరేంద్ర మోదీ సంస్థ బృందానికి అభినందనలు తెలిపారు. విక్రమ్-1 విజయవంతమైన ప్రయోగం అనంతరం స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా బృందం కృషిని ప్రశంసిస్తూ, భారత అంతరిక్ష ప్రయాణంలో ఇది ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. ప్రైవేట్ రంగం అంతరిక్ష రంగంలో పెరుగుతున్న భాగస్వామ్యం కొత్త అవకాశాలకు నాంది పలుకుతోందని, ఆవిష్కరణలకు మరింత వేగం తీసుకొస్తోందని ప్రధాని పేర్కొన్నారు. ఈ విజయం దేశంలోని యువతలో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించడమే కాకుండా, మరింత పెద్ద కలలు కనేందుకు, నిర్భయంగా కొత్త ఆవిష్కరణలు చేయడానికి స్ఫూర్తినిస్తుందని ఆయన అన్నారు.

## ఆసియా అండర్-23 అథ్లెటిక్స్‌లో స్వర్ణం

- ప్రవల్లికకు సీఎం రేవంత్ అభినందనలు



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : చైనాలోని ఒర్డోస్‌లో జరిగిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4x400 మీటర్ల రిలే విభాగంలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల డిగ్రీ కళాశాల విద్యార్థిని నరిమళ్ల ప్రవల్లికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి ప్రవల్లిక ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రవల్లిక అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు, దేశానికి కీర్తి తీసుకురావడం గర్వకారణమని సీఎం కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

## ఉత్తమ చిత్రంగా 'ఆర్టికల్ 370'

### 72వ జాతీయ చలనచిత్ర అవార్డులు ప్రకటింపు..




ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ: 2024 సంవత్సరానికి సంబంధించిన 72వ జాతీయ చలనచిత్ర అవార్డులను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. భారతీయ సినీ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఫీచర్, నాన్-ఫీచర్ చిత్రాలు, సినీ రచనలకు ఈ అవార్డులను ప్రకటించారు. ఈ ఏడాది ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ అవార్డును హిందీ చిత్రం 'ఆర్టికల్ 370' దక్కించుకోగా, ఈ చిత్రంలో నటించిన యామి గౌతమ్ ఉత్తమ నటి అవార్డును సొంతం చేసుకున్నారు. ఉత్తమ నటుడి విభాగంలో 'భ్రమయుగం' చిత్రానికి మమ్ముట్టి, 'చందు ఛాంపియన్' చిత్రానికి కార్తీక్ ఆర్యన్ సంయుక్తంగా ఎంపికయ్యారు. దర్శకుడిగా తొలి చిత్రంతోనే 'స్వాతంత్ర్య వీర్ సావర్కర్' సినిమాకు రణదీప్ హుడా ఉత్తమ డెబ్యూ దర్శకుడి అవార్డు అందుకున్నారు. తెలుగు సినిమాలు కూడా ఈసారి జాతీయ అవార్డుల్లో ప్రత్యేక గుర్తింపు పొందాయి. 'కల్కి 2898 ఏడి' ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా ఎంపిక కాగా, '35 చిన్న కథ కాదు' ఉత్తమ బాలల చిత్రంగా అవార్డు గెలుచుకుంది. 'కమిటీ కుర్రోళ్లు' ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపికైంది. అలాగే 'పుష్ప: ది రూల్ పార్ట్ 2' చిత్రానికి సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగంలో, 'లక్కీ భాస్కర్' చిత్రానికి వెంకీ అట్లూరి ఉత్తమ సంభాషణల రచయితగా అవార్డులు దక్కించుకున్నారు.

మిగితా 4 లో

## తెలంగాణ పీసీసీ పనితీరుపై ప్రశంసలు

### ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్



మిగితా 4 లో

సంస్థాగత కార్యక్రమాల అమలులో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని వ్యాఖ్య
పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్టీ బృందం పనితీరుపై సంతృప్తి

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాలు, శిక్షణా శిబిరాలు, ప్రజా ఉద్యమాల అమలుపై ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పార్టీ కార్యకలాపాలు మరింత క్రమబద్ధంగా సాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్, జై బాపు--జై భీమ్, మనగేర కార్యక్రమం, డీసీసీ అధ్యక్షుల శిక్షణా శిబిరాలు, ఎస్ఐఆర్ శిక్షణ, బీఎల్ఏల నియామకాలు, డీసీసీ, మండల కమిటీల ఏర్పాటు వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసినందుకు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో ఏఐసీసీ కనెక్టింగ్ సెంటర్ చైర్మన్ సెంథిల్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ కూడా పాల్గొని పీసీసీ అధ్యక్షుడితో పాటు రాష్ట్ర పీసీసీ కార్యాలయ సిబ్బంది పనితీరును ప్రశంసించారు. ప్రతి నెల జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాలపై సమగ్ర కార్యాచరణ నివేదికను సిద్ధం చేసి ఏఐసీసీకి పంపిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, పీసీసీ అధ్యక్షుల కార్యాలయ ఇన్‌చార్జ్ పి. ప్రసన్న కుమార్ శర్మ సేవలను మీనాక్షి నటరాజన్ ప్రత్యేకంగా కొనియాడారు. జూన్ నెల కార్యాచరణ నివేదికను పరిశీలించిన అనంతరం రాష్ట్ర పార్టీ అమలు చేస్తున్న విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఆధార్ యాప్ 4 కోట్ల డౌన్‌లోడ్లు



ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ: ఆధార్ యాప్‌కు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తోంది. ఈ యాప్ డౌన్‌లోడ్ల సంఖ్య 4 కోట్ల (40 మిలియన్లు) మైలురాయిని దాటినట్లు యూఐడీఏఐ వెల్లడించింది. డిజిటల్ గుర్తింపు సేవలను సులభంగా పొందేందుకు ప్రజలు ఆధార్ యాప్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నారని తెలిపింది. యాప్ ద్వారా ఇప్పటివరకు 11.65 లక్షల మంది చిరునామా, సుమారు 49 లక్షల మంది మొబైల్ నంబర్ అప్‌డేట్ చేసుకున్నారు. జూలై 1 నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ-మెయిల్ అప్‌డేట్ సేవ ద్వారా 12.5 లక్షల మంది ఈ-మెయిల్ వివరాలు నమోదు లేదా సవరించుకున్నారు.

4

ఆదివారం ,
జూలై 19, 2026
TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



## ఎస్సీ విభాగం బలోపేతమే లక్ష్యం: డాక్టర్ గడ్డం శ్రీనివాస్



ఆదాబ్ సైబరాబాద్, మల్కాజిగిరి : కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగాన్ని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఎస్సీ విభాగం నాయకుడు డాక్టర్ గడ్డం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఎస్సీ విభాగం కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులకు పార్టీ బాధ్యతలు, విధులపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. త్వరలో నిర్వహించనున్న జిల్లా స్థాయి సమావేశానికి సంబంధించిన కార్యాచరణను కూడా వివరించారు. జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు కావలి చంద్రయ్య మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. సమావేశంలో మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.కె. శ్రీనివాస్, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, మంథా భాస్కర్, ధరణ్, నవీన్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డు తరలింపే లక్ష్యంగా మహాధర్నా

### జూలై 26న భారీగా తరలిరావాలి: బీఆర్ఎస్ యువనేతల పిలుపు



ఆదాబ్ సైబరాబాద్, జవహర్ నగర్ : జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం, భరించలేని దుర్వాసన, ప్రజల ఆరోగ్య సమస్యలు, భూగర్భ జలాల కలుషితం వంటి సమస్యలతో స్థానికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డంపింగ్‌యార్డును జనావాసాలకు దూరంగా తరలించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డు సమస్య పరిష్కారం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన నాయకులు, జూలై 26న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ప్రజలు, ప్రజాసంఘాలు, యువతకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పొలాస అశోక్ కుమార్, విక్రమ్, అహ్మద్, అజీముద్దీన్, రాజు, పప్పు తదితర బీఆర్ఎస్ యువ నాయకులు పాల్గొన్నారు.

## మేడ్చల్లో కెఎల్ఆర్ వెంచర్‌లో రోడ్డు ఆక్రమణల కూల్చివేత



ఆదాబ్ సైబరాబాద్, మేడ్చల్:మేడ్చల్ లోని కె ఎల్ ఆర్ ఫేస్ -2 లోని 60 ఫీట్ల రోడ్డులో అనుమతులు లేకుండా రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన అక్రమ రేకుల షెడ్లను అధికారులు కూల్చివేశారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ సీపీ ఆదేశాలతో ఏసీపీ భాస్కర్, టీపీఎస్ సందీప్ లు ఈ చర్యలు చేపట్టారు. రహదారులను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.


## కూకట్‌పల్లి కోర్టు నుండి పటాన్చెరు మధ్య రెండో బస్సు సర్వీస్ ప్రారంభం





ఆదాబ్ సైబరాబాద్, కూకట్పల్లి : బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సౌకర్యార్థం పటాన్‌చెరు నుంచి కూకట్‌పల్లి కోర్టు వరకు రెండో బస్సు సర్వీసును ప్రారంభించినట్లు బార్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు పటాన్‌చెరు నుంచి బయలుదేరే బస్సు ఆర్‌సీ పురం, బీరంగూడ ఆర్చ్, అశోక్‌నగర్, భెల్ జంక్షన్, చందానగర్, గంగారం, మదీనాగూడ, ఆల్విన్ ఎక్స్ రోడ్స్, మియాపూర్, హైదర్‌నగర్, జేఎన్‌టీయూ, లులు మాల్, నెక్సస్ మాల్, మలేషియన్ టౌన్‌షిప్, 9వ ఫేజ్ మీదుగా ప్రయాణించి ఉదయం 10:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టుకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టు నుంచి బయలుదేరి అదే మార్గంలో ప్రయాణించి సాయంత్రం 6:15 గంటలకు పటాన్‌చెరు చేరుకుంటుంది. ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ సద్వినియోగం చేసుకుని బస్సు సేవ విజయవంతంగా కొనసాగేందుకు సహకరించాలని బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడానికి సహకరించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్, బార్ కౌన్సిల్ సభ్యుడు శ్రీ అశోక్ గౌడ్, గౌరవ న్యాయాధికారి మరియు టీజీఎస్‌ఆర్టీసీ అధికారులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి. పి, ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ గౌడ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## స్విట్జర్లాండ్ నుంచి రాగానే దంపతుల అరెస్ట్



- రూ.50 కోట్ల మోసం కేసులో ఎస్‌వోటీ అదుపులోకి
- చిట్టీలు, అధిక వడ్డీ పేరుతో వసూళ్ల ఆరోపణలు

ఆదాబ్ సైబరాబాద్ , చర్లపల్లి: చిట్టీలు, అధిక వడ్డీ పేరుతో ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చర్లపల్లికి చెందిన పబ్బా చంద్రశేఖర్, స్వప్న దంపతులను ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు వారిపై ఇప్పటికే కేసు నమోదైంది. బాధితుల ఆరోపణల ప్రకారం, దంపతులు అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి సుమారు రూ.50 కోట్ల మేర డబ్బులు సేకరించి స్విట్జర్లాండ్‌కు వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో దంపతులు కనిపించడం లేదని, వారి మొబైల్ ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్‌లో ఉన్నాయని కుమార్తె చర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాజాగా స్విట్జర్లాండ్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న పబ్బా చంద్రశేఖర్, స్వప్న దంపతులను ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. బాధితుల నుంచి వసూలు చేసిన నిధుల వివరాలు, డబ్బు లావాదేవీలు, మోసానికి సంబంధించిన అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

## హెచ్ పి వి వ్యాక్సిన్ తో సర్వైకల్ క్యాన్సర్ దూరం




ఆదాబ్ సైబరాబాద్,మేడ్చల్:13 ఏళ్లు నిండిన, 15 ఏళ్లలోపు బాలికలు హెచ్పీవీ వ్యాక్సిన్ విధిగా తీసుకోవాలని మేడ్చల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నీరజ్ సూచించారు. శనివారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాక్సినేషన్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 200 మందికి హెచ్పీవీ వ్యాక్సిన్ ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... హెచ్ పి వి వ్యాక్సిన్ తో బాలికలకు భవిష్యత్తులో సోకే సర్వైకల్ క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టవచ్చు అన్నారు. బాలికల తల్లిదండ్రులు అవగాహన పెంచుకొని వ్యాక్సిన్ అందజేయాలన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం తో పాటు సివిల్ ఆస్పత్రిలో వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందన్నారు కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కేటీఆర్ పిలుపుతో యువ సంగ్రామ సదస్సు

### మల్కాజ్‌గిరి నుంచి భారీ కార్ల ర్యాలీ





ఆదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సరూర్‌నగర్‌లో నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సు' కు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, నిరుద్యోగ యువత, పార్టీ శ్రేణులు వందలాది కార్ల ర్యాలీతో భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ యువతకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ అడ్డంకులను అధిగమించి పెద్ద సంఖ్యలో సదస్సుకు హాజరైన యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. యువత హక్కుల పరిరక్షణకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి భవిష్యత్తు కోసం రాజీలేని పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, జగదీష్ గౌడ్‌తో పాటు జేపీసీ వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, జీకే హనుమంతరావు, అనిల్ కిషోర్ గౌడ్, మేకల రాము యాదవ్, అమీనుద్దీన్, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, శ్రీధర్ గౌడ్, శ్రీనివాసులు, అరుణ్ రావు, సురేష్, అరవింద్, శివ గౌడ్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, బాలకృష్ణ, ఫరీద్, వంశీ ముదిరాజ్, హేమంత్ పటేల్, శివసాయి గౌడ్, చిన్న యాదవ్, ప్రభాకర్ గౌడ్, చంద్రమౌళి, విజయ్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, నిర్ణీత్ రెడ్డి, చిందం శ్రీనివాస్, భాస్కర్ రెడ్డితో పాటు అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతి, యువకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారతి పోర్టల్‌పై అధికారులకు అవగాహన కార్యక్రమం



ఆదాబ్ సైబరాబాద్, శంకర్ పల్లి :- చేవెళ్ల డివిజన్ పరిధిలో భూ భారతి పోర్టల్ అమలుపై రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పార్థసింహ రెడ్డి, చేవెళ్ల మండల తహసీల్దార్ కృష్ణయ్య పాల్గొని భూ భారతి పోర్టల్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, వాటి వినియోగం, అమలు విధానంపై సవివరంగా వివరించారు. భూ భారతి పోర్టల్ ద్వారా భూములకు సంబంధించిన వివిధ సేవలను ప్రజలకు పారదర్శకంగా, నిర్ణీత గడువులో అందించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలను అధికారులు ప్రదర్శించారు. పోర్టల్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, పరిష్కారం వంటి ప్రక్రియలను సులభతరం చేయడంతో పాటు, ప్రజలకు వేగవంతమైన సేవలు అందేలా అధికారులు ఎలా వ్యవహరించాలనే అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల డివిజన్ పరిధిలోని వివిధ మండలాల తహసీల్దార్లు హాజరై భూ భారతి పోర్టల్ అమలుకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంపొందించుకున్నారు. అలాగే మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం కూడా కార్యక్రమంలో పాల్గొని పోర్టల్ పనితీరు, పౌర సేవల నిర్వహణ విధానాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా అధికారులు భూ భారతి పోర్టల్ ద్వారా భూ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు.

## ఆదివాసీల పోడు భూముల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు తప్పవు

# తుడుం దెబ్బ హెచ్చరిక



ఆదాబ్ సైబరాబాద్, ములుగు జిల్లా : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం బందగిరి నగర గ్రామంలో ఆదివాసీల పోడు భూముల్లో అటవీశాఖ జోక్యాన్ని వెంటనే నిలిపివేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి లిలితుడుం దెబ్బలిలి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివాసీల పోడు భూముల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. గ్రామాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ, 2005కు ముందు నుంచి సాగులో ఉన్న సుమారు 100 ఎకరాల భూమిని అటవీశాఖ బలవంతంగా స్వాధీనం చేసుకుని జామాయిల్ తోట ఏర్పాటు చేసిందని ఆరోపించారు. ప్రత్యామ్నాయంగా 80 ఎకరాలు ఇస్తామని చెప్పి ఏడు నెలలుగా ఆదివాసులను మోసం చేస్తూ, ప్రస్తుతం సాగు చేస్తున్న భూముల్లోకి వచ్చి హక్కు పత్రాలు లేవంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. 2022లో అటవీ హక్కుల చట్టం కింద పట్టాల కోసం దరఖాస్తు చేసిన సమయంలో కూడా అధికారులు తప్పుడు పద్ధతుల్లో సంతకాలు తీసుకుని, భూములపై హక్కులు రాకుండా చేశారని ఆరోపించారు. ఇటీవల పోలీసుల రక్షణలో జేసీబీలతో వచ్చి భూముల చుట్టూ కందకాలు తవ్వుతూ మొక్కలు నాటేందుకు ప్రయత్నించగా, ఆదివాసీలు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అడ్డుకుని భూములను కాపాడుకున్నారని తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా, సర్వే నిర్వహించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో అమల్లో ఉన్న చట్టాలు, జీవో-57 ప్రకారం సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అమలు అవుతుంటే అటవీశాఖ ఎలా వ్యవహరిస్తోందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న క్యాంపా నిధులను దుర్వినియోగం చేస్తూ, అటవీశాఖ అధికారులు కాంట్రాక్టర్ల మాదిరిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పోడు భూముల్లో బలవంతంగా మొక్కలు నాటే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని, లేకపోతే కొమరం భీం స్ఫూర్తితో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలబోయిన వెంకట్ నారాయణ, ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు కలివేటి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నార్లపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం..

### రాగి జావ పంపిణీ ప్రారంభం



ఆదాబ్ సైబరాబాద్, ములుగు: ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లపూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో నార్లపూర్ సర్పంచ్ తోలెం కృష్ణ, ఉపసర్పంచ్ కట్కూరి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు వెక్కి విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాగి జావ పంపిణీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తోలెం కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరడంతో పాటు తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, తాడ్వాయి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంకిడి నరసింహస్వామి సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో జోరుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు

- ఒకే రోజులో వంద మందికి పైగా సభ్యుల నమోదు
- గవర్నర్ లక్ష సభ్యత్వ లక్ష్యానికి షాద్‌నగర్ నుంచి విశేష స్పందన.
- చైతన్య పాలీక్లినిక్ అండ్ డెంటల్ హాస్పిటల్‌లోనూ కొనసాగుతున్న సభ్యత్వ నమోదు



ఆదాబ్ సైబరాబాద్. షాద్ నగర్ : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేపట్టిన లక్ష సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఎంసీ సభ్యుడు మామిడి భీమిరెడ్డి ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.లయన్ రెడ్యానాయక్ భవాని ఐ కేర్ సెంటర్ ఆవరణంలో నిర్వహించిన ప్రత్యేక సభ్యత్వ నమోదు శిబిరంలో ఒకే రోజులో వంద మందికి పైగా నూతన సభ్యులను నమోదు చేసినట్లు మామిడి భీమిరెడ్డి తెలిపారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలకు సామాజిక వర్గాలన్నీ అండగా నిలవడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా మాజీ ఎంసీ సభ్యులు డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు, గోవా ఆంజనేయులు, మామిడి దామోదర్ రెడ్డి సమన్వయంతో నిర్వహించారు. అలాగే లయన్ డాక్టర్ రెడ్యానాయక్, ల్యాబ్ టెక్నీషియన్ రాజశేఖర్, సందీప్ తదితరులు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేశారు. అదేవిధంగా చైతన్య పాలీక్లినిక్ అండ్ డెంటల్ హాస్పిటల్లో కూడా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుండగా, సేవాభావం కలిగిన ప్రజలు అధిక సంఖ్యలో సభ్యత్వం పొందాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని విజయవంతం చేయడంలో షాద్‌నగర్ ప్రజలు విశేషంగా సహకరిస్తుండటం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు.

ఆదివారం ,
జూలై 19, 2026

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD

3

## సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలి

- ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీసే చర్యలను ప్రభుత్వం ఆపాలి
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజల పక్షాన నిలవాలి
- బీజేపీ యువమోర్చా నాయకులు గట్టు శివలింగం



ఆదాబ్ సైబరాబాద్, షాద్ నగర్ : సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని షాద్‌నగర్ బీజేపీ యువమోర్చా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావం పడటమే కాకుండా పశు సంరక్షణకు కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నిర్ణయం అమలైతే పరిసర ప్రాంతాల్లోని అనేక గ్రామాలు అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూసేకరణ సమయంలో ప్రజలకు ఫుడ్ ప్రాసెసింగ్ ఐటీ వంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి భూములు తీసుకున్నారని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అదే భూములను డంపింగ్ యార్డ్ కోసం వినియోగించాలనే నిర్ణయం తీసుకోవడం సరైన విధానం కాదని బీజేపీ యువమోర్చా నాయకులు గట్టు శివలింగం విమర్శించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యలపై స్పందించాలని వారు డిమాండ్.చేశారు సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రజల పక్షాన నిలిచి ఉద్యమించాలని కోరారు ప్రజల ప్రయోజనాలను కాపాడలేని పరిస్థితి ఉంటే ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేసి ప్రజలతో కలిసి పోరాడాలని బీజేపీ యువమోర్చా నాయకులు ఘాటుగా వ్యాఖ్యానించారు ప్రజలు ఓటు వేసి గెలిపించినందుకు వారి జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదు ప్రభుత్వం మంచి చేయకపోయినా పర్వాలేదు కనీసం ప్రజలు ప్రశాంతంగా జీవించే హక్కును కాపాడాలి ప్రజల జీవితాలతో చెలగాటమాడే నిర్ణయాలను వెంటనే నిలిపివేయాలి అని వారు అన్నారు. డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని సంబంధిత జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు లేదంటే కాంగ్రెస్ పార్టీకి షాద్ నగర్ నియోజకవర్గం లో ప్రజా వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ప్రజల సమస్యపై స్పందించకుండా మౌనం వహిస్తే భవిష్యత్తులో రాజకీయంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో ముందుకు సాగితే బీజేపీ యువమోర్చా ఊరుకోదని స్పష్టం చేశారు సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని అవసరమైతే షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ యువమోర్చా తరఫున హెచ్చరించారు.

## బాచుపల్లి పారిశ్రామిక ప్రాంతంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ

### జీవో-6 అమలు చేయాలి.. కార్మికులను బెదిరించడం మానుకోవాలి: సీఐటీయూ






ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో-6ను వెంటనే అమలు చేయడంతో పాటు పరిశ్రమల్లో ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాచుపల్లి ఐడీఏ పారిశ్రామిక ప్రాంతంలోని బొల్లారం చౌరస్తాలో శనివారం భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ సందర్భంగా సుమారు 300 మంది కార్మికులతో ర్యాలీ చేపట్టి తమ డిమాండ్లకు మద్దతు తెలిపారు.సభలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ, కనీస వేతనాల సవరణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-6ను అమలు చేయాలని పరిశ్రమల్లో కరపత్రాలు పంపిణీ చేస్తుండగా కొందరు యాజమాన్యాలు కార్మిక సంఘ నాయకులను బెదిరించడం తగదన్నారు. కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ ఎప్పుడూ అండగా ఉంటుందని, బెదిరింపులకు భయపడబోదని స్పష్టం చేశారు. కార్మికులకు అన్యాయం జరిగే ప్రతి చోట సీఐటీయూ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.జిల్లా అధ్యక్షుడు జే. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి ఏ. అశోక్ మాట్లాడుతూ, కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై అవగాహన కల్పిస్తున్న సీఐటీయూ నాయకులను బెదిరించడం సిగ్గుచేటని విమర్శించారు. బాచుపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి. శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి గణేష్, జిల్లా నాయకులు వెంకటరామయ్య, వెంకటరాజ్యం, లింగస్వామి, రాజశేఖర్, సత్తిబాబు, యంగ్ వర్కర్స్ కన్వీనర్ మణికంఠ, బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్తో పాటు పారిశ్రామిక, మున్సిపల్, భవన నిర్మాణ, ఆటో, తోపుడు బండి, సంత మార్కెట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వికారాబాద్‌లో 30 కిలోల గంజాయి స్వాధీనం..

### ఒడిశాకు చెందిన ఇద్దరు అరెస్ట్



ఆదాబ్ సైబరాబాద్, వికారాబాద్, జూలై 18: వికారాబాద్ జిల్లా పోలీసులు మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు డీఎస్పీ అంజయ్య పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేసి నిందితులను అదుపులోకి తీసుకుంది. అరెస్టైన వారిని ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన రామ్ హరి (43), జత్‌పూర్‌కు చెందిన కలాబాబు ఖాన్ (33)గా పోలీసులు గుర్తించారు. విచారణలో వీరిద్దరూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా గంజాయి అక్రమ రవాణాలోకి దిగినట్లు అంగీకరించినట్లు తెలిపారు. గంజాం జిల్లాకు చెందిన సునీల్ పాండీ అనే వ్యక్తి సూచనల మేరకు ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలకు సరఫరా చేస్తూ, విక్రయాల లాభాల్లో వాటా పొందుతున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. బెర్హంపూర్ నుంచి రైలులో సికింద్రాబాద్ చేరుకుని, అక్కడి నుంచి వికారాబాద్‌కు వచ్చిన నిందితులు రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయిని అప్పగించేందుకు వేచి ఉండగా పోలీసులు పట్టుకున్నారు. తనిఖీల్లో కలాబాబు ఖాన్ వద్ద 9 కిలోలు, రామ్ హరి వద్ద 21 కిలోల గంజాయి లభించడంతో మొత్తం 30 కిలోలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న ప్రధాన నిందితుడు సునీల్ పాండీతో పాటు మొత్తం నెట్‌వర్క్‌ను గుర్తించే దిశగా విచారణ సాగుతోందని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ అంజయ్య మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా యువత భవిష్యత్తుకు తీవ్ర ముప్పుగా మారుతోందని, గంజాయి రవాణా, విక్రయాలపై జిల్లా పోలీసులు ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు కొనసాగిస్తారని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్న ప్రత్యేక పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

## హైడ్రా రెండేళ్లు.. నగరవ్యాప్తంగా సంబరాలు

### నెక్లెస్ రోడ్డులో భారీ ర్యాలీ.. ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు









ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్, జూలై 18: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో సంబరాలు నిర్వహించారు. పార్కులు, చెరువులు, ప్రభుత్వ భూములు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను పరిరక్షించడంలో హైడ్రా చేపట్టిన చర్యలను అభినందిస్తూ కాలనీవాసులు, పౌర సంఘాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి. పార్కులను ఆక్రమణల నుంచి కాపాడి కాలనీలకు ఊపిరి పోశారని, చెరువుల పునరుద్ధరణతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడిందని పలువురు పేర్కొన్నారు. కొండలు, గుట్టలు, ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా హైడ్రా చర్యలు తీసుకుందని కొనియాడారు. హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పరిరక్షించిన ప్రభుత్వ భూముల వద్ద బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హుస్సేన్‌సాగర్, నెక్లెస్ రోడ్డుకు చేరుకుని ఎన్టీఆర్ గార్డెన్ నుంచి లుంబినీ పార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. హైడ్రా ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

హైడ్రా దేశానికే ఆదర్శంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా సేవలను జిల్లాలకు విస్తరించి చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను రక్షించే చర్యలు చేపట్టాలని కోరారు. గత రెండేళ్లలో హైడ్రా 3,315 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిరక్షించిందని, వాటి మార్కెట్ విలువ సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. అయితే పార్కుల రూపంలో పర్యావరణ పరిరక్షణ, చెరువుల పునరుద్ధరణతో భూగర్భ జలాల పెరుగుదల, వరదల నియంత్రణ వంటి ప్రయోజనాల దృష్ట్యా ఈ చర్యల విలువ మరింత గొప్పదని అభిప్రాయపడ్డారు. అనంతరం ప్రతినిధులు సచివాలయంలో వివిధ శాఖల అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

## ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి: సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యేల వినతి



ఆదాబ్ సైబరాబాద్,హైదరాబాద్ : తెలంగాణలోని ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, దళిత సంక్షేమానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గాల ఎమ్మెల్యేల బృందం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డా. ఎస్.ఏ. సంపత్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం మాట్లాడుతూ ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు అధిక నిధులు కేటాయించాలని, దళితుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరింది. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా జీవనోపాధి పథకాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో దళిత యువతకు అధిక ప్రోత్సాహం కల్పించాలని కోరింది. వినతులను సానుకూలంగా పరిశీలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలిపారు.ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు మందుల సామేలు, కవ్వంపల్లి సత్యనారాయణ, గణేష్, కె.ఆర్. నాగరాజు, రాగమయి, కాలే యాదయ్య, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా డీఆర్ఐ దాడులు.. రూ.20 కోట్ల స్మగుల్డ్ సిగరెట్లు, 15 కిలోల మెథాంఫెటమెన్ స్వాధీనం



ఆదాబ్ సైబరాబాద్, న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక నిఘా ఆపరేషన్లలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) భారీగా మాదకద్రవ్యాలు, అక్రమ సిగరెట్లు, ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. ఈ ఆపరేషన్లలో 15 కిలోల మెథాంఫెటమైన్, సుమారు 4 కిలోల ప్సూడోఎఫెడ్రిన్, రూ.20 కోట్ల విలువైన సుమారు 85 లక్షల విదేశీ సిగరెట్లు, పాకిస్థాన్‌లో తయారైన రెండు పిస్టళ్లను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేశారు. మిజోరాంలో మయన్మార్ నుంచి అక్రమంగా తరలిస్తున్న 15 కిలోల మెథాంఫెటమైన్‌ను ట్రక్కులో గుర్తించి ఒకరిని అరెస్టు చేశారు. ముంబైలోని న్హావా శేవా పోర్టులో దుబాయ్ నుంచి వచ్చిన కంటైనర్‌లో ప్లాస్టిక్ స్టోరేజ్ బాక్సుల పేరుతో అక్రమంగా దిగుమతి చేసిన 85 లక్షల గోల్డ్ ఫ్లేక్ బ్రాండ్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో డ్రోన్ ద్వారా పడవేసిన రెండు పార్శిళ్లలో పాకిస్థాన్‌లో తయారైన రెండు పిస్టళ్లు, మ్యాగజైన్‌లు లభించాయి. చెన్నైలో నిర్వహించిన మరో దాడిలో మెథాంఫెటమైన్ తయారీలో ఉపయోగించే సుమారు 4 కిలోల ప్సూడోఎఫెడ్రిన్‌ను స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వ్యాపారం, సరిహద్దుల ద్వారా ఆయుధాల తరలింపుపై డీఆర్ఐ కఠిన చర్యలు కొనసాగిస్తుందని అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్ సమీక్ష సమావేశం..

### కుత్బుల్లాపూర్‌లో ఎస్ఐఆర్ ఓటర్ల సవరణపై క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపు



ఆదాబ్ సైబరాబాద్, కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఎస్ఐఆర్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి హాజరై డివిజన్ అధ్యక్షులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి డివిజన్‌లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, జాబితాలోని తప్పులను సరిదిద్దే ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం జారీ చేసిన ఎస్ఓపీ ప్రకారం ప్రతి బూత్ పరిధిలో ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, పరిశీలనతో పాటు ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సమన్వయంతో విజయవంతం చేయాలని నాయకులు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

TGTEL/26/A4985

ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD




(మొదటి పేజీ తరువాయి)

- రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు
- 65 సంస్థల్లో తనిఖీలు
- 91 నమూనాలు పరీక్షలకు

ఈ తనిఖీల్లో కొన్ని లైసెన్స్ పొందిన సంస్థలు తయారు చేసిన నెయ్యిలో ఇతర కొవ్వులు కలిపినట్లు ప్రాథమికంగా గుర్తించిన అధికారులు, మరికొన్ని సంస్థలు ఎలాంటి లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ లేకుండానే నెయ్యి తయారీ, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సంబంధిత సంస్థల నుంచి నెయ్యి నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపగా, ఫలితాల ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని క్యూర్ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 14 సంస్థలను తనిఖీ చేసి 15 నెయ్యి నమూనాలను సేకరించారు. వినియోగానికి పనికిరాదని తేలిన 60 కిలోల నెయ్యిని అక్కడికక్కడే ధ్వంసం చేయగా, అనుమానాస్పదంగా గుర్తించిన 850 కిలోల నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. ప్రయోగశాల నివేదికల్లో కల్తీ నిర్ధారణైతే సంబంధిత ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. ఇక రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 65 ఆహార సంస్థలను పరిశీలించి, మొత్తం 91 నెయ్యి నమూనాలను పరీక్షల కోసం సేకరించారు.



నిబంధనలు ఉల్లంఘించిన ఐదు సంస్థలకు నోటీసులు జారీ చేశారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం ప్రకారం నెయ్యిలో 99.5 శాతం పాల కొవ్వు ఉండాలని, తేమ శాతం 0.5 శాతానికి మించకూడదని అధికారులు గుర్తు చేశారు. నెయ్యిలో పామాయిల్, వనస్పతి వంటి వృక్షజన్య కొవ్వులను కలపడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ప్రజలు నాణ్యమైన, లైసెన్స్ పొందిన సంస్థల నుంచే నెయ్యి కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసే ముందు ఫీూూూ× లైసెన్స్ నంబర్, తయారీ వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలని కమిషనర్ సూచించారు. కొనుగోలు బిల్లులను భద్రంగా ఉంచుకోవాలని, కల్తీ ఆహార పదార్థాలు లేదా లైసెన్స్ లేకుండా విక్రయాలు జరుగుతున్నట్లు అనుమానం ఉంటే వెంటనే ఫుడ్ సేఫ్టీ శాఖకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

(మొదటి పేజీ తరువాయి)

## ఉపాధ్యాయుల పాత్ర విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అత్యంత కీలకం





ప్రతి విద్యార్థి డాక్టర్, ఇంజనీర్, శాస్త్రవేత్త, సివిల్ సర్వెంట్, ఉపాధ్యాయుడు, క్రీడాకారుడు లేదా తనకు నచ్చిన రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. విజయానికి అభిరుచి, క్రమశిక్షణ, నిరంతర సాధన తప్పనిసరి అని అన్నారు. ఉపాధ్యాయుల పాత్ర విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అత్యంత కీలకమని పేర్కొంటూ, వారి సూచనలను పాటించాలని, సందేహాలను అడగడంలో ఎలాంటి సంకోచం ఉండకూడదని చెప్పారు. తల్లిదండ్రులను గౌరవించాలని, వారి ఆశయాలను నెరవేర్చేలా కష్టపడాలని సూచించారు. వైఫల్యాలను చూసి నిరాశ చెందకుండా వాటిని విజయానికి పునాదిగా మార్చుకోవాలని, జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అబ్బాయిలు, అమ్మాయిలు సమానంగా చదువుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రసంగం అనంతరం మంత్రి విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడుతూ బ్యాటింగ్, ఫీల్డింగ్‌కు సంబంధించిన సూచనలు అందించారు. తన అంతర్జాతీయ క్రికెట్ అనుభవాలను పంచుకుని విద్యార్థులను ఉత్సాహపరిచారు. వందలాది మంది విద్యార్థులు ఆయనతో కలిసి ఫోటోలు దిగడంతో పాటు ఆటోగ్రాఫ్‌లు తీసుకున్నారు. మంత్రి సందర్శన తమకు మరపురాని అనుభవంగా నిలిచిందని, ఆయన సందేశం తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి విద్య, క్రీడలు, జీవితంలో మరింత కృషి చేయాలనే స్ఫూర్తిని కలిగించిందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

(మొదటి పేజీ తరువాయి)




'కల్కి 2898 ఏడి'కు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్, 'పుష్ప: ది రూల్ పార్ట్ 2' కు ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్, 'కమిటీ కుర్రోళ్లు'కు ఉత్తమ మేకప్ విభాగంలో జాతీయ అవార్డులు లభించాయి. నాన్-ఫీచర్ విభాగంలో 'భంగార్'ఉత్తమ నాన్-ఫీచర్ చిత్రంగా, 'రామ్-నామి' ఉత్తమ డాక్యుమెంటరీగా ఎంపికయ్యాయి. జాతీయ చలనచిత్ర అవార్డులను ఫీచర్ ఫిల్మ్ జ్యూరీ చైర్మన్ జయరాజ్, నాన్-ఫీచర్ జ్యూరీ చైర్మన్ అసీమ్ సిన్హా, సినీ రచనల జ్యూరీ చైర్మన్ ఏ. చంద్రశేఖర్ సంయుక్తంగా ప్రకటించారు.

(మొదటి పేజీ తరువాయి)

## డిజిటల్ సేవలకు పెరుగుతున్న ఆదరణ

గతంలో రూ.75గా ఉన్న ఈ సేవను 2026 డిసెంబర్ 31 వరకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపింది. అలాగే బయోమెట్రిక్ లాక్/అన్‌లాక్ ఫీచర్‌ను 1.91 కోట్ల సార్లు వినియోగించినట్లు పేర్కొంది. ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి నుంచే చిరునామా, మొబైల్, ఈ-మెయిల్ అప్‌డేట్, ఈ-ఆధార్ డౌన్‌లోడ్, బయోమెట్రిక్ లాక్/అన్‌లాక్ వంటి సేవలను ఈ యాప్ ద్వారా సురక్షితంగా పొందవచ్చని యూఐడీఏఐ వెల్లడించింది.

### ఎల్బీనగర్ ఫ్లెక్సీ వివాదంపై టీపీసీసీ అధ్యక్షుడికి కమిటీ నివేదిక



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ : ఎల్బీనగర్ నియోజకవర్గంలో చోటుచేసుకున్న ఫ్లెక్సీ వివాదానికి సంబంధించి వివాద పరిష్కార కమిటీ తన నివేదికను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు శనివారం గాంధీభవన్‌లో సమర్పించింది. జక్కిడి శివ చరణ్ రెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, వైజీటీ యాదగిరిగుట్ట కమిటీ సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్ మధ్య తలెత్తిన వివాదాన్ని పరిశీలించేందుకు నియమితులైన కమిటీ సభ్యులు జగ్గారెడ్డి, మధు యాష్కీ గౌడ్, చల్లా నర్సింహారెడ్డి గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడిని కలిసి తమ నివేదికను అందజేశారు. నివేదికను స్వీకరించిన మహేష్ కుమార్ గౌడ్, కమిటీ సూచనలు, సిఫార్సులను పరిశీలించి పార్టీ విధానాలకు అనుగుణంగా తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియ, బీఎల్ఏ శిక్షణా కార్యక్రమాలు, జనహిత పాదయాత్ర తదితర అంశాలపై సమీక్ష నిర్వహించిన అనంతరం తెలంగాణ పీసీసీ అమలు చేస్తున్న సంస్థాగత విధానం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఆమె పేర్కొన్నారు. ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలనే ఉద్దేశంతో దాదాపు 11 రాష్ట్రాల నుంచి ఏఐసీసీ నాయకులు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు తెలంగాణ పీసీసీని అభినందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గ్రామ, బూత్ స్థాయిల వరకు మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మీనాక్షి నటరాజన్ పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి బీఎల్ఏపై ఒక సూపర్వైజర్‌ను నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.తెలంగాణ పీసీసీ చేపడుతున్న కార్యక్రమాలపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ కూడా సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆమె వెల్లడించారు. పార్టీ కార్యాలయ కార్యకలాపాల సమన్వయం, కార్యాచరణ నివేదికల తయారీ, సంస్థాగత కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న పి. ప్రసన్న కుమార్ శర్మను మరోసారి అభినందించిన ఆమె, సోషల్ మీడియా, కనెక్టింగ్ సెంటర్, పార్టీ సంస్థాగత కార్యక్రమాలను మరింత చురుకుగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గాంధీభవన్ సిబ్బంది సేవలను కూడా ఆమె ప్రశంసించారు. ఈ సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కనెక్టింగ్ సెంటర్ చైర్మన్ సెంతిల్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు పి. ప్రసన్న కుమార్ శర్మ, కొప్పుల ప్రవీణ్ కుమార్, గంప వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లో సత్తా చాటిన రైతు బిడ్డ..!

### ఖమ్మం డాక్టర్స్ మెడికల్ అకాడమీలో శిక్షణ




ఆదాబ్ హైదరాబాద్, ఖమ్మం: కష్టపడి చదివితే గ్రామీణ విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో ప్రతిభ చాటగలరని మరోసారి నిరూపించింది ఖమ్మం జిల్లా వైరా మండలం ఆరికాయలపాడు గ్రామానికి చెందిన రైతు కుటుంబం కుమార్తె మోదుగు దీపిక. తాజాగా విడుదలైన నీట్ 2026 ఫలితాల్లో 413 మార్కులు సాధించి జిల్లాకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.దీపిక తల్లిదండ్రులు మోదుగు కాంతారావు-సువార్త. రైతు కుటుంబానికి చెందిన ఆమె వైరా సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసించింది. అనంతరం ఖమ్మంలోని డాక్టర్స్ మెడికల్ అకాడమీలో నీట్‌కు ప్రత్యేక శిక్షణ పొందింది. పట్టుదల, క్రమశిక్షణతో చేసిన కృషి ఫలితంగా నీట్-2026లో 413 మార్కులు సాధించి వైద్య విద్యలో ప్రవేశానికి అర్హత సాధించింది. ఆమె విజయం గ్రామీణ విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా దీపికను ఆమె తల్లిదండ్రులు, గురుకుల అధ్యాపకులు, డాక్టర్స్ మెడికల్ అకాడమీ డైరెక్టర్లు రాయల సతీష్ బాబు, ఈగ భరణి కుమార్, అధ్యాపకులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు ఘనంగా అభినందించారు. రైతు కుటుంబం నుంచి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన దీపిక విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

## అందెశ్రీ నా ఆత్మబంధువు..

### ఆయన స్ఫూర్తే ప్రజా ప్రభుత్వానికి శ్రీరామరక్ష: సీఎం రేవంత్ రెడ్డి



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజాకవి డాక్టర్ అందెశ్రీ జయంతి సందర్భంగా ఘట్‌కేసర్‌లో ఏర్పాటు చేయనున్న అందెశ్రీ స్మృతి వనంకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం అందెశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి భావోద్వేగంగా మాట్లాడుతూ, "అందెశ్రీ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు కవి, గాయకుడు, ఉద్యమకారుడిగా పరిచయం కావొచ్చు. కానీ నాకు మాత్రం ఆయన ఆత్మబంధువు. నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నానంటే, ఆయన గానంలో ఉన్న స్ఫూర్తి కూడా ఒక కారణం" అని అన్నారు. తన కుటుంబంలో ఏడుగురు అన్నదమ్ముల్లో నాలుగో వాడినని, పెద్దన్నను కోల్పోయిన తర్వాత తనకు పెద్దన్నగా కనిపించిన వ్యక్తి అందెశ్రీనే అని సీఎం గుర్తు చేసుకున్నారు. ఉద్యమ కాలంలో ఏర్పడిన వారి అనుబంధాన్ని స్మరించుకుంటూ, తెలంగాణపై ఆధిపత్యం చెలాయించాలని లేదా ఈ నేలను దోచుకోవాలని ఎవరైనా ప్రయత్నిస్తే, అలాంటి ప్రతి తరంలోనూ మరో అందెశ్రీ పుడతారని హెచ్చరించారు. "అందెశ్రీ స్ఫూర్తి మన గుండెల్లో నిత్యం కొలువై ఉంటుంది. ప్రజా ప్రభుత్వానికి ఆయన స్ఫూర్తే శ్రీరామరక్ష. అందెశ్రీ, గద్దర్ చూపిన మార్గంలోనే ఈ ప్రభుత్వం ముందుకు సాగుతుంది" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో జీవితాలను అంకితం చేసిన తొమ్మిది మంది ఉద్యమకారులను పార్టీలు, జెండాలు చూడకుండా సత్కరించి, ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. అది ప్రభుత్వ ధనం కాదు, ప్రజల సొమ్మేనని స్పష్టం చేశారు.

అందెశ్రీ రచించిన "జయ జయహే తెలంగాణ", "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు" వంటి పాటలు కేవలం గీతాలు మాత్రమే కాదని, అవి ప్రజావ్యతిరేక పాలనపై పోరాడిన ఉద్యమ ఫిరంగులని అభివర్ణించారు. ఆయన పదాల్లో నింపిన ఉద్యమ స్ఫూర్తి తెలంగాణలో ప్రతి బిడ్డను ఉద్యమం వైపు నడిపించిందని కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 జూన్ 2న "జయ జయహే తెలంగాణ" గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించిన సందర్భంగా అందెశ్రీ భావోద్వేగానికి లోనైన క్షణాలను కూడా ముఖ్యమంత్రి సభలో గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల గొంతు కోస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్

### కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలవి దొంగ నాటకాలు - తీన్మార్ మల్లన్న



ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలు వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. సరూర్‌నగర్ స్టేడియంలో నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడుతున్నట్లు నటిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కులగణన పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ అగ్రవర్ణాల ప్రయోజనాలకే పనిచేస్తున్నాయని విమర్శించారు. 2019లో 103వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నెం.65 ద్వారా అమలు చేసి, ఓపెన్ కేటగిరీలోని అవకాశాలను తగ్గించిందని మల్లన్న ఆరోపించారు. దీంతో మెరిట్ ఆధారంగా ఉద్యోగాలు పొందే బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల అవకాశాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కులగణన ప్రకారం ఓసీల్లో ఈడబ్ల్యూఎస్ అర్హుల శాతం 5.36 మాత్రమే ఉన్నప్పటికీ వారికి 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, మరోవైపు 56.33 శాతం జనాభా ఉన్న బీసీలకు కేవలం 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే కొనసాగుతున్నాయని అన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో-65ను వెంటనే రద్దు చేసి, ఆ తర్వాతే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని టీఆర్పీ డిమాండ్ చేసింది. జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ ప్రభుత్వం ఏర్పడితేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తీన్మార్ మల్లన్న పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు కోసం నిరుద్యోగులు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.


EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com